క్లుప్తంగా


నేడు శ్రీవారికి చక్రస్నానం

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి శనివారం చక్రస్నానం చేయనున్నట్లు ఆలయ అర్చకులు వి.వి.అప్పలాచార్యులు శుక్రవారం తెలిపారు. ఉదయం నిత్యారాధన, విశేష హోమాలు, మంగళ శాసనములు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం 9 గంటలకు వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారికి చక్రతీర్థ స్నానం చేయడం జరుగుతుందన్నారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

గరుగుబిల్లి: మండలంలోని నాగూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ బి.శంకరరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గుర్తించి, సహకరించాలని కోరారు.

విరగ్గాసిన పనస



చెట్టు మొదలు వరకు ఉన్న పనస కాయలు

సీతంపేట: మండలంలోని జగతపల్లిలో ఉన్న ఓ పనస చెట్టు విరగ్గాసింది. చెట్టు మొదలు వరకు కాయలు ఉండడంతో స్థానికులు ఈ చెట్టును ఆసక్తిగా చూస్తున్నారు. ప్రస్తుతం 20 వరకు కాయలున్నాయని, మరికొన్ని కాయలు కాసే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

కళ్లద్దాల పంపిణీ



కురుపాం సీహెచ్‌సీ వద్ద కళ్లద్దాలతో వృద్ధులు

కురుపాం: నేత్ర శస్త్రచికిత్సలు చేయించుకున్న పలువురికి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో కళ్లద్దాలు, మందులు శుక్రవారం పంపిణీ చేశారు. నేత్రవైద్యాధికారి నగేష్ రెడ్డి వీరికి నేత్రవైద్య తనిఖీలు చేసి, ఆరోగ్య సలహాలు, సూచనలు చేశారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేయిస్తున్న ఉచిత ఆరోగ్య తనిఖీలు, శస్త్రచికిత్స సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం



ఆశ్రమ పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

సీతంపేట: పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమపాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీ విద్యార్థినులు దాదాపు 1200 మంది పరీక్షకు హాజరయ్యారు. ఏర్పాట్లను ఆయా పాఠశాలల సిబ్బంది పర్యవేక్షించారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం

మక్కువ: స్థానిక బీసీ కాలనీలో ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ఆరవెల్లి విజయ్‌కుమార్ శర్మ వేదమంత్రోచ్ఛరణల నడుమ ఈ కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడుతో పాటు, భక్తులు పాల్గొని, పూజలు చేశారు. మహిళలు కలశాలతో, ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులతో తిరువీధి నిర్వహించారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి

సాలూరు: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు వర్తకులు సహకరించాలని పట్టణ సీఐ జి.దేముడుబాబు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో కోటవీధి సమీపంలో పలువురు వర్తకులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాపార దుకాణాల ముందు రోడ్డుపై వాహనాలు నిలుపుదల చేయవద్దని దుకాణాలకే వచ్చే వినియోగదారులకు సూచించాలని అన్నారు. నిబంధనలకు అనుగుణంగా దుకాణాలు ఉండాలని ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదన్నారు.

ఎన్నికలకు సమాయత్తం కావాలి..

- చిన్న చిన్న సమస్యలుంటే పరిష్కరించుకుందాం
- ఉమ్మడి విజయనగరం జిల్లా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

పాలకొండ: అధికార పార్టీలో ఉన్నాం.. కొన్ని కొన్ని సమస్యలుండడం సహజమే.. వాటిని పరిష్కరిస్తాం .. రాజకీయ పార్టీ అన్న తర్వాత విభేదాలుంటాయి.. అయితే అవి కేవలం పార్టీ లైన్‌లో మాత్రమే ఉండాలి. అంతేకాని పార్టీ లైన్ దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవు. ఎన్నికల సమయం ఆసన్నమైయింది. ఇప్పుడు విభేదాలను పక్కన పెట్టి అంతా సమన్వయంతో పనిచేయాలని వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్, ఉమ్మడి విజయనగరం జిల్లా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) సూచించారు. పాలకొండ నగర పంచాయతీకి సంబంధించి పార్టీ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులతో ఏఎంజీ కన్వర్షన్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరితో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తీసుకుంటున్నామని తెలిపారు. చిన్న చిన్న సమస్యలను వెంట వెంటనే పరిష్కరిస్తామని, అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లతో పాటు పార్టీ సీనియర్ నాయకులతో విడివిడిగా మాట్లాడారు. సమావేశంలో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, నియోజవర్గ పరిశీలకుడు సత్యనారాయణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏఓ మన్మథరావు

భామిని: రబీ సీజన్‌లో సాగు చేసే పంటల వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి కిమిడి మన్మథరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌బీకేలో వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో ముమ్మరంగా సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న, కూరగాయలు, ఇతర ఆరుతడి పంటలు, పండ్ల తోటల వివరాలను నమోదు చేయాలని సూచించారు. దిగుబడులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు అందేలా సహకరించాలన్నారు. అలాగే భూసార పరీక్షల నమూనాల సేకరణ త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

పోలియో చుక్కలు తప్పనిసరి



సూచనలిస్తున్న ఎంపీడీఓ జగదీష్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: పోలియో బారినపడకుండా ఉండేందుకు ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఎంపీడీవో జి.జగదీష్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భద్రగిరి ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వైద్యారోగ్య శాఖాధికారులు, కార్యదర్శులతో శుక్రవారం సమావేశమైన ఆయన మార్చి 3వ తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద శిబిరాలు ఏర్పాటు చేసి, పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని, అలాగే మార్చి 4, 5వ తేదీల్లో ఇంటింటికీ వెళ్లి, మిగిలిన పిల్లలకు కూడా పోలియో చుక్కలు వేయాలన్నారు. సమావేశంలో భద్రగిరి ఐసీడీఎస్ పీవో సీహెచ్ సుశీల దేవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



రవికుమార్‌కు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, రాజశేఖరం, తదితరులు

పాలకొండ రూరల్: ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేస్తూ అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని ఎల్.ఎల్.పురం గ్రామానికి చెందిన రేజేటి రవికుమార్ అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి లక్ష రూపాయలు మంజూరు చేయించారు. దీంతో చెక్కును పార్టీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం చేతులమీదుగా బాధితుడికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు, సర్పంచ్‌లు ద్వారపూడి కుమార్ బాబు, సింగంవలస విజయ్‌కుమార్, గురునాయుడు, రవణమ్మ, ఆర్. శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ సమావేశం

పాలకొండ: నగర పంచాయతీ సాధారణ సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ సర్వేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు.. ఇంతవరకు చేపట్టిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. నగర పంచాయతీ అధ్యక్షురాలు యందవ రాధాకుమారి అధ్యక్షతన చేపట్టనున్న సమావేశానికి కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన



హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న బుర్రకథ కళాకారులు

కొమరాడ: మండల కేంద్రంలో హెచ్‌ఐవీ(హ్యూమన్ ఇమ్యూనో వైరస్) నియంత్రణపై బుర్రకథ రూపంలో కళాకారులు శుక్రవారం అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ ద్వారా సోకే అత్యంత ప్రమాదకరమైన వ్యాధి ఎయిడ్స్ అని, అవగాహన ఉంటే వ్యాధికి దూరంగా ఉండొచ్చని తెలిపారు. హెచ్‌ఐవీ సోకిన వ్యక్తి(స్త్రీ) పాలు, లైంగిక సంబంధాలు, రక్తమార్పిడి ద్వారా వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. అలాగే ఈ వ్యాధి అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని అన్నారు.

సంతాపం..

సీతంపేట: ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో వివిధ కారణాలతో ఐదుగురు పంచాయతీ కార్యదర్శులు మృతి చెందడంతో మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.సత్యం, పంచాయతీ సెక్రటరీలు వై.పాపారావు, సుదర్శనరావు, రాజశేఖర్, రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభ్యసనాభివృద్ధితో నైపుణ్యాలను పెంచవచ్చు



బలిజిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నిస్తున్న అధికారి కల్పన

బలిజిపేట: అభ్యసనాభివృద్ధి కార్యక్రమంతో విద్యార్థులలో నైపుణ్యాలను పెంచవచ్చని లిప్ స్టేట్ నోడల్ అధికారిణి కల్పన తెలిపారు. బలిజిపేట ఉన్నత పాఠశాలను ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె 8వ తరగతి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై ప్రశ్నించారు. విద్యార్థులు తెలిపిన సమాధానాలపై కొంతమేర సంతృప్తి చెంది, కొన్ని సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న లిప్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలకు వెనుక భాగంలో ఉండే కీలక పదాలపై దృష్టి సారిస్తే వారిలో మంచి భాషా నైపుణ్యాలు పెరుగుతాయని తెలిపారు. అభ్యసనాభివృద్ధిలో భాషా సంబంధిత విషయాలను విద్యార్థులకు అందించి వారిలో చదవడం, రాయడం నైపుణ్యాలు, మెలుకువలు వారికి బాగా నేర్పిస్తే ఎంతో మంచిదన్నారు.

కొండాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పాలకొండ: మండలంలోని కొండాపురంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. సుమారు 250 మందికి వైద్యసేవలందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దేవి, ఏఎన్‌ఎం కుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



తనిఖీలు చేపడుతున్న పోలీసులు

గరుగుబిల్లి: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ అమ్మనరావు హెచ్చరించారు. మండలంలోని ఎర్రన్నగుడి కూడలి వద్ద శుక్రవారం సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు, లైసెన్స్‌లు పరిశీలించడంతో పాటు మద్యం తాగినదీ లేనిదీ గమనించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

కేంద్రానికి వ్యతిరేకంగా నిరసన



ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ నాయకులు కూరంగి మన్మథరావు, లింగరాజు, బిడ్డిక రామ్మూర్తి, మండంగి నర్సింహులు, పువ్వల ప్రసాద్ శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు పంజాబ్-హర్యానా సరిహద్దులోని ఖనౌరిలో బుధవారం చోటుచేసుకున్న యువరైతు శుభ్‌కరణ్‌సింగ్ మరణానికి కారణం ప్రధాని మోదీ నిర్లక్ష్య వైఖరేనని నినదించారు. పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, రైతు పండించిన పంటలకు ధరను నిర్ణయించుకునే అధికారం రైతుకే కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే మృతి చెందిన రైతు కుటుంబాలకు పరిహారం చెల్లించాలని కోరారు.

ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన



వసతులపై ఆరాతీస్తున్న ఆర్‌డీఓ హేమలత

గరుగుబిల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓట్ల లెక్కింపు కోసం కేటాయించదలచిన మండలంలోని ఉల్లిభద్ర దగ్గరున్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాలను ఆర్‌డీవో కె.హేమలత శుక్రవారం సందర్శించి, అక్కడి వసతులను పరిశీలించారు. పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి, కురుపాం, పాలకొండ, సాలూరు, పార్వతీపురం నియోజకవర్గాల ఎన్నికల బ్యాలెట్ బాక్స్‌లను ఇక్కడే భద్రపరిచి, ఓట్లు లెక్కించనున్నారు. ఈ మేరకు అసోసియేట్ డీన్ బి.ప్రసన్నకుమార్‌తో ఆర్‌డీవో మాట్లాడి, వసతులపై ఆరాతీశారు.

తప్పుడు మస్తర్లు వేస్తే చర్యలు తప్పవు



ఉపాధి పనుల పరిశీలనలో పీడీ రామచంద్రరావు

జియ్యమ్మవలస: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, తప్పుడు మస్తర్లు వేస్తే చర్యలు తప్పవని ఉపాధి హామీ పథకం పీడీ కె.రామచంద్రరావు హెచ్చరించారు. మండలంలోని గవరమ్మపేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. మస్తర్లు తనిఖీ చేసి, పనిలోకి వచ్చిన వేతనదారులకు మాత్రమే మస్తర్లు వేయాలని సూచించారు. పనిలోకి రానివారికి మస్తర్లు వేయొద్దని సూచించారు. రెండు పూటలా నిర్దేశిత కొలతల ప్రకారం వేతనదారులతో పనులు చేయించాలని, సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు.

రూ.2 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



కొత్తగా వేస్తున్న సీసీ రోడ్డు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని సచివాలయ కాలనీకి వెళ్లే దారిలో కొత్తగా సీసీ రోడ్డు నిర్మాణం శుక్రవారం చేపట్టారు. వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్ మాట్లాడుతూ రూ.2 లక్షల మండల పరిషత్ నిధులతో ఈ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణం జరుగుతుండడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.గౌరీశంకరరావు పాల్గొన్నారు.

యంత్ర పరికరాల సరఫరాకు టెండర్లు



టెండర్లు నిర్వహిస్తున్న జీసీసీ డీఎం సంధ్యారాణి

సీతంపేట: పీఎం జనమన్ పథకంలో భాగంగా సీతంపేట ఐటీడీఏ పరిధిలో గల 53 పీవీటీజీ వీడీవీకే కేంద్రాలకు అవసరమయ్యే యంత్ర పరికరాల సరఫరాకు శుక్రవారం స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో టెండర్లు నిర్వహించారు. 20 రకాల పరికరాలకు టెండర్లు జరగ్గా ఐదుగురు సరఫరాదారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, జీసీసీ డీఎం సంధ్యారాణి, వెలుగు ఏపీడీ సన్యాసిరావు, పీఏఓ హరికృష్ణ, పీహెచ్ఓ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్యసేవలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిస్ట్ కృష్ణారావు

భామిని: ఇంటింటికీ వైద్యసేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమం ఉద్దేశమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోషిలక్ష్మి, సీహెచ్ఓ భాస్కరరావు అన్నారు. మండలంలోని లివిరి సచివాలయం వద్ద శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 423 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. ఆప్తాలమిస్ట్ కృష్ణారావు రోగులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పి. అప్పారావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'పల్స్ పోలియో'ను విజయవంతం చేయాలి

గరుగుబిల్లి: రావివలస, గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మార్చి 3వ తేదీన జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయా పీహెచ్‌సీల వైద్యులు సంతోష్ కుమార్, కార్తీక్ కోరారు. ఇదే విషయమై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమావేశమైన వారు ఐదేళ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. పోలియో చుక్కలు వేసేందుకు గ్రామాల్లోనే కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వైద్య సిబ్బందితో పాటు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలంతా కార్యక్రమంలో భాగస్వాములై, శతశాతం కార్యక్రమ లక్ష్యం నెరవేరేలా చూడాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, వైద్యారోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ తన వైఖరి మార్చుకోవాలి



శుభకరణ్ సింగ్‌కు జోహార్లు అంటూ ర్యాలీ చేస్తున్న రైతులు, సీఐటీయూ నాయకులు

పాలకొండ రూరల్: హర్యానా సరిహద్దులో తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు రైతులు ఆందోళన చేస్తుంటే, వారిపై పోలీసులచే దాడి చేయిస్తున్న ప్రధాని మోదీ తన వైఖరి మార్చుకోవాలని సీఐటీయూ నాయకుడు డి. రమణారావు అన్నారు. ఈ మేరకు అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు, పలు రైతు సంఘాల ప్రతినిధులతో కలసి పాలకొండ పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. రైతులను చర్చలకు పిలిచి తన యంత్రాంగంతో దాడులు చేసి రైతులను మట్టుబెట్టడం సరికాదన్నారు. సోమనాథ్ కమిషన్ సిఫార్సుల మేరకు పంటలకు మద్దతు ధర కల్పించాలని, రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు శుభకరణ్ సింగ్ మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, కె.రవికుమార్, రామినాయుడు, పాపారావు, కూర్మారావు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో భరోసా..



రామదాసు భార్య సుజాతకు రూ.2 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి



నడుకూరుకు చెందిన గణపతికి లక్ష రూపాయల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ముఖ్యమంత్రి సహాయనిధి ఎందరో అభాగ్యులకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని దశుమంతపురం, నడుకూరు గ్రామాలకు చెందిన ఇద్దరికి రూ. 3 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం అందజేశారు. దశుమంతపురం గ్రామానికి చెందిన రామదాసు నాగభూషణరావు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ గతేడాది నవంబర్ 17న మృతి చెందాడు. ఇతని భార్య సుజాతకు రూ.2 లక్షల చెక్కు... నడుకూరు గ్రామానికి చెందిన గురుబిల్లి గణపతి క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల కోసం లక్ష రూపాయల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు,వావిలపల్లి హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొమరాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మల్లిఖార్జునరావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఎంపీపీ శెట్టి శ్యామల అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అభివృద్ధి పనులకు సంబంధించి, పూర్తిస్థాయి నివేదికలతో అధికారులంతా హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వ సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: ఆదివాసీలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత విద్యుత్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఉన్నతాధికారి సూర్యప్రతాప్ కోరారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల పరిధిలోని కంబగూడ, లోవలక్ష్మీపురం, కుస గ్రామాల్లో ఆదివాసీ గృహాలకు కల్పిస్తున్న విద్యుత్ సరఫరా పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత విద్యుత్ సరఫరా పథకంలో భాగంగా విద్యుత్ మీటర్లు, సర్వీసు వైరు, ఎల్ఈడీ బల్బులను ఉచితంగా అందజేస్తున్నాయని తెలిపారు. పీఎం జన్‌మన్ పథకం కింద ఆదివాసీలు ఈ సదుపాయాలు పొందవచ్చన్నారు.